సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



నాయకులకే దళితబంధు

రాజకీయ నాయకులకు మాత్రమే దళిత బంధు పథకం వర్తింస్తోందని జాపర్‌పల్లి వాసులు రోడ్డెక్కారు. 10లో▸



అర్హులందరికీ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. 10లో▸



వరించిన అవార్డులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌–2023 జిల్లాస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా దాదాపూర్ ఎంపికైనట్లు సర్పంచ్ కృష్ణ తెలిపారు. 11లో▸

న్యూస్‌రీల్

17న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు


తాండూరు టౌన్: ఈ నెల 17న అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం మధు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరులోని పాత శాలివాహన కళాశాల మైదానంలో ఉదయం 8గంటల నుంచి అండర్ –14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలకు 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1,500 మీటర్ల పరుగు పందెం పోటీలు ఉంటాయని తెలిపారు. అలాగే లాంగ్ జంప్, షాట్‌పుట్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఈ నెల 30న కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పంపనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9912328142, 8978234447లలో సంప్రదించాలని సూచించారు.

నేడు జాబ్‌మేళా

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 15న (శుక్రవారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి అబ్దుల్ సుభాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10:30కు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. 25 సేల్స్ ఆఫీసర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని తెలిపారు. నెల జీతం రూ. 10వేలు, టీఏ, డీఏ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 21 నుంచి 32 సంవత్సరాల వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జాబ్‌మేళా నిర్వాహకుడు మియా సాబ్ సెల్ నంబర్ 967604744లో సంప్రదించాలని ఆయన కోరారు.

అక్షరాలా మూడు లక్షలపైనే..

వినియోగదారుడికి కరెంట్ బిల్లు షాక్



Customer Name : P RATNAMMA W/O LOCHAIAH
Bill Number : S010 04837
Bill Date : 04-Sep-2023

₹ 3,73,763

Due Date: 18-Sep-2023

లక్షల్లో వచ్చిన విద్యుత్ బిల్లు

షాద్‌నగర్‌రూరల్: ప్రతీనెల వేలల్లో వచ్చే విద్యుత్ బిల్లు ఒక్క సారిగా లక్షల్లో వచ్చింది. బిల్లును చూసిన వినియోగదారుడు ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ఈ సంఘటన గురువారం షాద్‌నగర్ పట్టణంలో వెలుగు చూసింది. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీనివాస జనరల్ స్టోర్‌కు ప్రతి నెల దాదాపు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు విద్యుత్ బిల్లు వస్తుంది. ఆగస్టు నెలకు సంబంధించిన బిల్లు ఏకంగా రూ.3,73,763 వచ్చింది. బిల్లును చూసిన షాపు యజమాని పొగాకు ప్రకాష్ నివ్వెరపోయాడు. వేలల్లో వచ్చే బిల్లు లక్షల్లో రావడంతో అధికారులను అడిగేందుకు విద్యుత్ కార్యాలయానికి వెళ్లాడు. ఏఈ, లైన్‌మన్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందిని సంప్రదించాడు. అధికారులతో మాట్లాడి బిల్లును సరి చేస్తామని సిబ్బంది సమాధానమిచ్చి పంపించారు.

17న వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఈ నెల 17న తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరీశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో ఉదయం 9 గంటలకు వేడుకలు నిర్వహించాలని తెలిపారు. జాతీయ జెండాను ఆవిష్కరించడానికి మంత్రి సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డు ప్రదానం



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి

కందుకూరు: అవార్డును మండల పరిధి లోని నేదునూరు కైవసం చేసుకుంది. రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర శిక్షణాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీ పీడీ ప్రభాకర్, ఎంపీడీఓ ఎస్.వెంకట్రాములు, ఎంపీఓ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

‘మల్టీ’.. పట్టీ!

మల్టీ జోనల్ విధానంతో జిల్లా ఉపాధ్యాయులకు తీరని అన్యాయం

- జిల్లాలో ఖాళీగా ఉన్న జీహెచ్‌ఎం పోస్టులు 92
- పదోన్నతుల్లో మనకు దక్కేది 8నుంచి 10శాతమే
- నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లా వాసులకు లబ్ధి
- నిరుత్సాహంలో ఉపాధ్యాయులు
- పాత పద్ధతి అమలు చేయాలని డిమాండ్

వికారాబాద్: మల్టీ జోనల్ విధానం వల్ల జిల్లా ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతోంది. గతంలో పదోన్నతి ద్వారా గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టుల భర్తీ జిల్లా పరిధిలో ఉండేది. ప్రస్తుతం మల్టీ జోనల్ విధానం అమల్లో ఉండడంతో ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎం పోస్టుల కోసం పోటీ పడుతున్నారు. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ పక్క జిల్లాల ఉపాధ్యాయులు తన్నుకుపోనున్నారు. కనీసం పది శాతం పదోన్నతులు కూడా ఇక్కడి ఉపాధ్యాయులకు దక్కేలా కనిపించడం లేదు. ఇప్పటి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల జీహెచ్‌ఎంలు జిల్లా వాసులే ఉండేవారు. మల్టీ జోనల్ కారణంగా పదోన్నతుల ప్రక్రియ ముగియగానే సగానికిపైగా ఉన్నత పాఠశాలలు పక్క జిల్లాల టీచర్లతో నిండిపోనున్నాయి. గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టు.. జోన్ల పునర్విభజన తరవాత మల్టీ జోనల్ పరిధిలోకి వెళ్లింది. అయితే సీనియారిటీలో జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు వెనకబడి ఉండడంతో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ పక్క జిల్లాలకు చెందిన వారు తన్నుకుపోనున్నారు. దీంతో పదోన్నతుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఇక్కడి ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరగనుంది. జిల్లా ఉపాధ్యాయులకు దక్కాల్సిన 50శాతం పదోన్నతులు మహబూబ్‌నగర్ నుంచి వికారాబాద్‌లో కలిసిన మూడు మండలాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లకే దక్కనున్నాయి. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిసెంట్లుగా పదోన్నతి పొందే వారికి సైతం ఇదే తరహాలో అన్యాయం జరగనుందని సంఘాల నేతలు వాపోతున్నారు. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియ ఈ నెల 16 నుంచి ప్రారంభం కానుండగా ఇప్పటికే వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు.

జిల్లాలో 92 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ

ప్రస్తుతం జిల్లాలో 92 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో జెడ్పీ హెచ్‌ఎస్‌లలో 88, ప్రభుత్వ పాఠశాలల్లో 04 ఖాళీలు ఉన్నాయి. సీనియారిటీ ప్రాతిపదికన చూస్తే ఎనిమిది నుంచి 10 పోస్టులు మాత్రమే మన జిల్లా ఉపాధ్యాయులకు దక్కనున్నాయి. మిగతా పోస్టుల్లో ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు చేరే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి జిల్లా వాసులకు అన్యాయం జరగకుండా జీఓలను సవరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

వారికి నో చాయిస్

పది నెలల క్రితం ప్రభుత్వం జీఓ నంబర్ 317ను తీసుకొచ్చింది. దీని ద్వారా పునర్విభజన అయిన జిల్లాలకు ఉద్యోగుల పంపకాలు చేశారు. ఈ సమయంలో ఉద్యోగులకు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏ జిల్లానైనా ఎంచుకోవచ్చని ఆప్షన్ ఇచ్చారు. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు రంగారెడ్డి జిల్లా పరిధిలోని హౌస్ అలెవన్స్ వచ్చే స్థానాల కోసం ఎగబడ్డారు. అయితే వారిలో చాలా మందికి సీనియారిటీ లేకపోవడం, అప్పటికే సీనియారిటీ ఉన్న టీచర్లు హెచ్‌ఆర్‌ఏ ప్లేసుల్లో పాతుకుపోవడంతో వికారాబాద్ జిల్లా నుంచి మంచి ప్లేస్ ఆశించి వెళ్లిన ఉపాధ్యాయులకు నిరాశే ఎదురయ్యింది. హెచ్‌ఆర్‌ఏ ప్లేస్‌లు అటుంచితే రంగారెడ్డి జిల్లా పరిధిలోని రూరల్ మండలాలకు చెందిన సుదూర ప్రాంత పాఠశాలలకు నియమించారు. దీంతో ఏంచేయాలో పాలుపోక ఉసూరుమంటున్న సమయంలో మ్యూచువల్ బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో వారి రొట్టె విరిగి నేతిలో పడినట్లుయ్యింది. అదే అదనుగా భావించిన రంగారెడ్డి, మేడ్చెల్ జిల్లాల నుంచి వచ్చి వికారాబాద్ మారుమూల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఎగబడ్డారు. ఇదే అవకాశంగా భావించిన రంగారెడ్డి, మేడ్చెల్ జిల్లాల్లో ఉన్న వికారాబాద్‌కు చెందిన ఉపాధ్యాయులు వారితో బేరసారాలు మొదలు పెట్టారు. మ్యూచువల్ బదిలీల కోసం రూ. 10 నుంచి రూ. 15 లక్షల వరకు పుచ్చుకున్నట్లు సమాచారం. అయితే రంగారెడ్డి, మేడ్చెల్ జిల్లాల నుంచి సొంత జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులకు మారుమూల పాఠశాలల్లో పోస్టింగులు లభించాయి. ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల్లో రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికే బదిలీలు ఉండే అవకాశం ఉన్నందున ఇతర జిల్లాల నుంచి సొంత జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులకు నిరాశే ఎదురవుతోంది.



మల్టీ జోనల్ విధానం వద్దు



మల్టీ జోనల్ విధానం వల్ల జిల్లా ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుంది. గతంలో గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టుల భర్తీ జిల్లా పరిధిలో ఉండేది. ప్రస్తుతం విధానం వల్ల ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎం పోస్టుల కోసం పోటీ పడాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు వికారాబాద్ జిల్లాలో శిక్షణ పొందిన అభ్యర్థుల కొరత ఉన్న సమయంలో నాటి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం జిల్లా వాసులకు అన్యాయం జరగకుండా చూశారు. స్పెషల్‌గా అన్ ట్రైన్డ్ డీఎస్సీ వేసి జిల్లా వాసులనే నియమించారు. తరువాత శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు అదే విధానం అమలు చేయాలని జిల్లా ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. అలా కాదని మల్టీ జోనల్ విధానం అమలు చేస్తే జిల్లాలోని సగం కంటే ఎక్కువ ఉన్నత పాఠశాలలు పక్క జిల్లాల హెచ్‌ఎంలతో నిండిపోవడం ఖాయం.

– అమర్‌నాథ్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

టెట్‌కు సర్వం సిద్ధం

- 25 కేంద్రాల్లో నేడు పరీక్ష
- వికారాబాద్, తాండూరు, పరిగిలో సెంటర్లు
- పేపర్–1కు 5,765మంది, పేపర్–2కు 3,846 మంది అభ్యర్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



వికారాబాద్‌లోని పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: శుక్రవారం జరగనున్న టెట్ –2023 పరీక్షకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వికారాబాద్, తాండూరు, పరిగిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించారు. గత ఏడాదిలో 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ సారి అభ్యర్థుల సంఖ్య పెరగడంతో అదనంగా మరో సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 9,611 మంది దరఖాస్తు చేసుకున్నారు. 25 కేంద్రాల్లో ఉదయం 9:30గంటలకు జరిగే పేపర్ –1 పరీక్షకు 5,765 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమయ్యే పేపర్ –2 పరీక్షకు 3,846 మంది హాజరుకానున్నారు.

కట్టుదిట్టమైన చర్యలు

పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి పొరపాట్లు జరగకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా సెంటర్ల పూర్తి వివరాలను ఇప్పటికే పోలీసు శాఖకు అందించారు. ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. హాల్ టికెట్ నంబర్లు వేయడం, సదుపాయాల ఏర్పాటులో సిబ్బంది నిమగ్నమయ్యారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరాదని డీఈఓ ఆయా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఆదేశించారు. అభ్యర్థులు బ్లాక్ బాల్‌పెన్, హాల్ టికెట్ మాత్రమే తీసుకెళ్లాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదన్నారు. ఇతర శాఖలకు చెందిన 300 మంది అధికారులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. మరో 80 మంది అధికారులు పరీక్షలను పర్యవేక్షించనున్నారు. పరిగిలో 5 పరీక్ష కేంద్రాలు, తాండూరులో 3, వికారాబాద్‌లో 17 సెంటర్లను ఏర్పాటు చేశారు. టెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 08416–254964కు కాల్ చేయవచ్చని అధికారులు సూచించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఉత్తమ గ్రామపంచాయతీ సర్పంచులను సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఉత్తమ పంచాయతీల పాలకవర్గాలకు ఘన సన్మానం

వికారాబాద్ అర్బన్: గ్రామ పరిసరాలు బాగుంటే మనం ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌– 2023 రాష్ట్ర, జిల్లా స్థాయి స్వచ్ఛత అవార్డులు అందుకున్న జీపీల సర్పంచులు, పాలకవర్గాలను గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే ప్రజల నుంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. మంచి పనులు చేస్తున్నప్పుడు కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయని, వాటిని అధిగమించి ప్రజలకు చక్కటి సదుపాయాలు కల్పించేలా పని చేయాలని సూచించారు. 12 జీపీలకు జిల్లాస్థాయిలో, పరిగి మండలం రాఘవపూర్ రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఈ పంచాయతీలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమం పంచాయతీల పాలకవర్గ సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్ కుమార్, డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ ఇన్‌చార్జ్ సీ ఈఓ సుభాషిని, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డుకు ఎంపికైన జీపీలు

వికారాబాద్ మండలంలోని పులుమద్ది, ద్యాచారం, మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల, చీమలదరి, కొడంగల్ మండలంలోని రుద్రారం, బంటు వారం తొర్మామిడి, కులకచ్చర్ల మండలంలోని బండి వెంకిచర్ల, నవాబుపేట మండలంలోని ఎల్లకొండ జిల్లా స్థాయి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులకు ఎంపిక కాగా, పరిగి మండలం రాఘవపూర్ జీపీ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది.

మన పథకాలు దేశానికే ఆదర్శం

- జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మోమిన్‌పేట: తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శమని జెడ్పీ వైస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డి.వసంతతో కలిసి 48 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదల ఆడపిల్లల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వంటి పథకాలతో పేదలు మెరుగైన వైద్యం పొందుతున్నారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం లో అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతోపాటు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే పంట దిగుబడులను కొనుగోలు చేస్తోందని తెలిపారు. రైతు బంధు, రైతు బీమాతో అన్నదాతల ఆత్మహత్యలు లేకుండా పోయాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఆర్ఐ రాజు, ఎంపీటీసీ రోజా, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, హరిశంకర్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

సుపరిపాలన భేష్

- చీమల్‌దరి జీపీ పాలకవర్గానికి ఉత్తర్‌ప్రదేశ్ సర్పంచుల కితాబు
- గ్రామంలో పర్యటన, అభివృద్ధి పనుల పరిశీలన
- ప్రజలకు అందుతున్న సేవలను వివరించిన ఎంపీడీఓ శైలజారెడ్డి



చీమల్‌దరిలో పార్కును పరిశీలిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ సర్పంచులు, అధికారులు

మోమిన్‌పేట: చీమల్‌దరి పంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజలకు అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర సర్పంచులు, అధికారులు కితాబునిచ్చారు. జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు పొందిన చీమల్‌దరి గ్రామాన్ని గురువారం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన 25మంది సర్పంచులు, అధికారుల బృందం సందర్శించింది. గ్రామంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సేవలను ఎంపీడీఓ శైలజారెడ్డి వారికి వివరించారు. ఉచిత వై ఫై, ప్రతి ఇంటికి బీఎస్ఎన్ఎల్ ఫోన్ కనెక్టివిటీ, పంచాయతీ లావాదేవీలు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే చేయడం వంటివి సుపరిపాలనకు దోహద పడిందని వివరించారు. గ్రామ పరిశుభ్రత, పచ్చదనం, ప్రకృతి వనం తదితర వాటిని ఎంపీడీవో బృందం సభ్యులకు చూపించి వాటి గురించి వివరించారు. గ్రామంలో 100శాతం భూగర్భ మురుగు కాల్వల నిర్మాణం వల్ల దోమలకు ఆస్కారం లేదని పేర్కొన్నారు. పంచాయతీ భవన నిర్మాణ, అభివృద్ధి పనులపై ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర సర్పంచులు, అధికారుల బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీఓ యాదగిరి, కార్యదర్శి సుగుణ పాల్గొన్నారు.

కల సాకారమవుతున్న వేళ

- నేడు అనంతగిరిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

అనంతగిరి: వికారాబాద్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల శుక్రవారం ప్రారంభం కానుంది. అనంతగిరి టీబీ శానిటోరియంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్ విధానం ద్వారా కళాశాలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే 90 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ప్రారంభోత్సవానికి సంబంధించి మంత్రి మహేందర్‌రెడ్డితో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మమాలిని సమీక్షించారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రి ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు.

భారీ ర్యాలీ నిర్వహించండి: కలెక్టర్

వికారాబాద్ అర్బన్: జిల్లా వైద్య కళాశాలను శుక్రవారం సీఎం కేసీఆర్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్నందున ఉదయం 9గంటలకు ఆలంపల్లి ఎక్స్ రోడ్డు నుంచి ఎన్టీఆర్ ఎక్స్ రోడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ర్యాలీలో మెడికల్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, కళాశాల విద్యార్థులు, మెప్మా సిబ్బంది పాల్గొనేలా చూడాలని ఆదేశించారు.



మంత్రి మహేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మమాలిని

క్రీడాకారులకు అన్నివిధాలా ప్రోత్సాహం

- మంత్రి మహేందర్‌రెడ్డి

మొయినాబాద్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడలకు పెద్దపీట వేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్‌లోని గుత్తా జ్వాల అకాడమీలో నిర్వహిస్తున్న అండర్–15, అండర్–17 బాలబాలికల 36వ యోనెక్స్ సన్‌రైస్ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను గురువారం మంత్రి చేతులమీదుగా ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 560 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్రీడా పాలసీ దేశానికి వన్నెతెచ్చేలా, క్రీడాకారుల నైపుణ్యం పెంచేలా ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో 18 వేల గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని.. గతంలో పీవీ సింధు, సానియామీర్జా వంటి క్రీడాకారులను ప్రోత్సహించిన విషయాన్ని గుర్తు చేశారు. క్రీడా పాలసీ కోసం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కూడిన మంత్రి వర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని.. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు మేరకు మౌలిక సదుపా యా ల కల్పన చేపడుతున్నామన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెరిగేలా పాఠ్యాంశాల్లో భాగం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

దంపతులపై దాడి!

బషీరాబాద్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి దంపతులపై దాడికి దిగాడు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దామర్‌చెడ్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెరుకు అర్చన, రాజుగౌడ్ దంపతులు. అదే గ్రామానికి చెందిన బోయగోపాల్ అర్ధరాత్రి మద్యం సేవించి ఇంటి తలుపులను తన్నడంతో అర్చన తలుపు తీసింది. వెంటనే ఆమె చెయిపట్టిలాగి కిందపడేశాడు. ఇంట్లో ఉన్నా దివ్యాంగుడైన రాజుగౌడ్‌పై దాడి చేశాడు. గతంలో తన తమ్ముడిపై కేసుపెట్టారన్న కోపంతో బోయ గోపాల్ తమపై దాడి చేశారని దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దంపతులు


కుల్కచర్ల : రాస్తారోకో చేస్తున్న ఇప్పాయిపల్లి గ్రామస్తులు


పరిగి: కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పార్టీ నాయకులకే దళితబంధు

రోడ్డెక్కిన జాపర్‌పల్లి, సుల్తాన్‌పూర్ దళితులు

పరిగి: రాజకీయ నాయకులకు మాత్రమే దళిత బంధు పథకం వర్తిస్తుందని, అర్హులకు దళితబంధు అందడంలేదని పరిగి మండలంలోని జాపర్‌పల్లి, సుల్తాన్‌పూర్‌కు చెందిన దళితులు రోడ్డెక్కారు. గురువారం పరిగి, షాద్‌నగర్ రోడ్డు, హైదరాబాద్, బీజాపూర్ జాతీయ రహ దారిపై బైటా యించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మా ట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి కోసం తీసుకు వచ్చిన పథకంలా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎంతో మంది నిరుపేదలు తినడానికి తిండిలేక ఇబ్బందులు పడుతున్నారని , అలాంటి వారికి ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకు ల కు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలల్లో రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువైందని మండిపడ్డారు. గ్రామసభ ఏర్పాటు చేసి నిరుపేద దళితులను ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమ ంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఇప్పాయిపల్లి గ్రామస్తులు

కుల్కచర్ల: పైసలున్నోళ్లకు మాత్రమే దళితబంధు పథకం అందుతుందని దళిత మహిళలు, యువకులు ఆందోళన చేపట్టారు. గురువారం మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామస్తులు పెద్దఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగాలు, పార్టీ నాయకులు, డబ్బులున్నోళ్లకే దళితబంధు పథకం ఇస్తున్నారని ఆరోపించారు. నిజమైన నిరుపేద దళితులకు పథకం అందకపోవడం దారుణమన్నారు. కమిషన్లు ఇస్తేనే దళితబంధు ఇస్తారని, రాజకీయాల్లో తిరిగేటోళ్లకే పథకాలు అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో 7మందికి మాత్రమే దళితబంధు ఇచ్చారు. వాళ్లను మాత్రమే ఓట్లు అడగాలి, తమను అడిగితే చీపుర్లకు పని చెప్పాల్సివస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కారు, బైక్ ఢీకొని..

తండ్రీ కొడుకుకు తీవ్రగాయాలు


ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన బైక్

కొడంగల్ రూరల్: కారు బైక్ ఢీకొని తండ్రీ కొడుకుకు తీవ్ర గాయాలైన ఘటన పట్టణ శివారులోని కర్ణాటక రోడ్డులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని గుర్మిట్‌కల్‌కు చెందిన చెన్నప్ప, గోపాల్ తండ్రీకొడుకులు. సొంత పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొడంగల్ మీదుగా వెళ్తున్న బైక్ కర్ణాటక రోడ్డులో ఓ టీస్టాల్ ముందు ఆగిఉన్న కారు వెనకకు తీసుకుంటున్న క్రమంలో బైక్ వేగంగా కారును ఢీకొంది. బైక్ నడుపుతున్న గోపాల్(కొడుకు)కు తీవ్ర గాయాలు కాగా, తండ్రి చెన్నప్పకు కాలు విరిగింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తాండూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బంట్వారం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం కోట్‌పల్లి మండలానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంలాంటివన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. దేశంలో ఇలాంటి పథకాలు ఎక్కడా లేవన్నారు. అనేక అభివృద్ధి ,సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

సీడబ్ల్యూసీలో ఆమోదించాలి


రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశంలో ఆమోదించాలని కోరుతూ గురువారం వికారాబాద్ ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, పలువురు రాష్ట్ర ప్రతినిధులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి శివ, వీఎస్ రాజు, మల్లికార్జున్, మల్కప్ప, ప్రకాష్, సుభాష్, మధు, శంకర్, రాజు, నరేష్, మహేందర్, డప్పు నర్సింలు తదితరులు ఉన్నారు.

దైవ దర్శనానికి వచ్చి మృత్యుఒడికి..

మోమిన్ పేట్: దైవదర్శనం కోసం వస్తే ఆ దైవం తన మెడలో పుస్తెల తాడు లేకుండా చేశాడని ఓ మహిళా కన్నీటి పర్యంతమైన ఘటన గురువారం మోమిన్‌పేట్ మండలంలోని రాళ్లగుడుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లి మండలం కొల్హాపూర్ గ్రామానికి చెందిన చంద్రయ్య (52) భార్య శోభ గురువారం ఎన్కతలలోని రామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. దైవ దర్శనం ముందు వాగులో స్నానం చేసుకునేందుకు దేవాలయం ముందు పారుతున్న నందివాగు ప్రాజెక్టు కాలువలో స్నానం చేసేందుకు దిగాడు. ఐదు నిమిషాల పాటు కాలువలో ఈదిన చంద్రయ్య అకస్మాత్తుగా నురుగులు కక్కుతూ నీటిపై తేలిపోయాడు. ఒడ్డుపై ఉన్న భార్య శోభ గమనించి చుట్టూ పక్కల వారికి చెప్పడంతో వారు చంద్రయ్యను కాలువలో నుంచి బయటకు తీశారు. అప్పటికే చంద్రయ్య మృతిచెందాడు. కళ్ల ముందే భర్త మృతి చెందడంపై భార్య రోదనలు మిన్నంటాయి. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.


మృతి చెందిన చంద్రయ్య

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌గౌడ్

హుడాకాంప్లెక్స్: రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి వెట్టిచాకిరీ నుంచి ప్రజలను విముక్తి చేసింది కమ్యూనిస్టు పార్టీలేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో గురువారం డాక్టర్స్ కాలనీలో నిర్వహించిన రైతాంగ పోరాట వార్షికోత్సవ సభకు ప్రభాకర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రావినారాయణరెడ్డి, దొడ్డి కొమురయ్య, ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి అనేకమంది నాయకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని, నాటినుంచి నేటి వరకు పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టులేనని గుర్తుచేశారు. భూస్వాముల నుంచి దాదాపు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. అనంతరం సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ.. సాయుధ పోరాటం నుంచి నేటివరకు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ నేడు దొరల పాలైందని, రాష్ట్రం సాధించినా పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అదే విధంగా స్థానిక ఎన్‌టీఆర్‌నగర్‌లో ఇంటి స్థలాల రెగ్యులరైజేషన్ కుర్చీ వేసుకుని రెండునెలల్లో చేయిస్తానని హామీలు ఇచ్చినవారు ఇప్పటికీ పత్తాలేరన్నారు. రానున్న రోజుల్లో ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలతో కలిసి సీపీఐ పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని అన్నారు. సీపీఐ మహేశ్వరం నియోజకవర్గ కోకన్వీనర్ ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దత్తునాయక్, సరూర్‌నగర్ మండల కన్వీనర్ బాతరాజు నర్సింహ, నాయకులు పూజారి శ్రీను, కందుల సుధాకర్, ఇస్మాయిల్, రాములుగౌడ్, యాదయ్యగౌడ్, శక్రునాయక్, లక్ష్మీ, రాధా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌గౌడ్

గోసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


గోవులకు పండ్లు తినిపిస్తున్న ఆంజనేయులు

కుల్కచర్ల: గోసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతాని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని ఘనపూర్‌లోని గోశాలను సందర్శించి ఆవులకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోమాతలను పూజించడం, వాటిని సంరక్షించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

8మంది అనుమానితుల బైండోవర్

అబ్దుల్లాపూర్‌మెట్: వినాయకచవితి, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5మంది అనుమానిత వ్యక్తులను గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. తారమతిపేట గ్రామానికి చెందిన కటికే శ్రీను, పసుపునేటి మహేష్, కటికె స్వామి, ఉమర్‌ఖాన్‌గూడకు చెందిన వినాయక్‌దేశ్‌ముఖ్, గుంతపల్లి గ్రామానికి చెందిన నయీంల ప్రవర్తన అనుమానంగా ఉండటంతో వారు శాంతిభద్రతలకు భంగం కల్గించే విధంగా ప్రవర్తించే అవకాశమున్నందున ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వారిలో సత్ప్రవర్తన రావాలన్న ఆలోచనతోనే బైండోవర్ చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు.

గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధిలో..

యాచారం: వినాయక చవితి, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముగ్గురు రౌడీ షీటర్లను గురువారం కందుకూర్ తహసీల్దార్ కృష్ణయ్య ముందు బైండోవర్ చేసినట్లు సీఐ రామాంజనేయులు తెలిపారు. గొట్టెలగడ్డతండాకు చెందిన కొర్రరాజు, ఆకులామైలారం గ్రామానికి చెందిన రావుల మల్లేష్, మాలగూడెంకు చెందిన జిట్టె పవన్‌కుమార్‌ను తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వారిలో సత్ప్రవర్తన కోసమే బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

విత్తన మట్టి గణపతులతో మేలు

తాండూరు టౌన్: విత్తన మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతోందని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు. గురువారం విత్తనాలతో కూడిన మట్టి గణపతులను పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించడానికి సీఎం కేసీఆర్ ప్రతి ఏటా హరిత హారం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దానికి కొనసాగింపుగా గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరుతో ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన కార్యక్రమం శరవేగంగా దూసుకెళ్తుందన్నారు. మట్టి గణపతుల్లోని విత్తనాలు వృక్షాలుగా మారి పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులనే కొలిచి పర్యావరణ రక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీరజా, ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మట్టి గణపతులను పంపిణీ చేసిన శుభప్రద్ పటేల్, తదితరులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉద్యోగుల పని తీరు భేష్

యాలాల: గ్రామాల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేసిన మండల ఉద్యోగులను గురువారం కలెక్టర్ నారాయణరెడ్డి సన్మానించారు. ఎస్‌బీఎం, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పథకంలో భాగంగా జిల్లాలోని 13 గ్రామాలను ఎంపిక చేయగా, అందులో యాలాల మండలంలోని కోకట్ పంచాయతీని అధికారులు ఎంపిక చేశారు. ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్వహణ, హరిత హారం తదితర అంశాల్లో మండల అధికారులు మెరుగైన పనితనం కనబరిచారని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య, ఏపీఎం ప్రమీళ, ఈసీ శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌తో పాటు ఏపీఓ, టీఏ తదితరులను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ కృష్ణన్, ఇతర అధికారులు ఉన్నారు.


మండల అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జయకృష్ణ

బొంరాస్‌పేట: మండలంలోని మెట్లకుంటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జయకృష్ణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గురువారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జయకృష్ణను రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కోస్గి మాజీ ర్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు నర్సిములుగౌడ్, భీమయ్యగౌడ్, రాజేశ్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులున్నారు. అనంతరం దుప్‌చర్ల, బురాన్‌పూర్‌కు చెందిన ఉపసర్పంచ్ రవీందర్‌గౌడ్‌తోపాటు పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని పార్టీలోకి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు.


జయకృష్ణను అభినందిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

రూ.10లక్షల బెనిఫిట్ ఇవ్వాలి


బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జిల్లా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం ఉపాధ్యక్షురాలు వసంత

మోమిన్‌పేట: అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని జిల్లా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం ఉపాధ్యక్షురాలు వసంత డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ విరమణ తర్వాత రూ.10 లక్షల బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలని కోరారు. తరచూ వివిధ యాప్‌లతో అధికారుల వేధింపులు ఆపాలని చెప్పారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు భారతి, రేణుక ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించండి

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నాలుగు రోజూ కొనసాగింది. గురువారం సమ్మెలో భాగంగా వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో బతుకమ్మలు ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద బీమా రూ.20 లక్షలు ఇవ్వాలని అన్నారు.. అధికారుల వేధింపులు ఆపి పని భారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు భారతి, లక్ష్మి, ప్రమీల, భాగ్యలక్ష్మి, కవిత, చంద్రకళ, మనోహర, సుజాత, కళావతి, నిర్మల, రాములమ్మ, ఇందిర, విజయలక్ష్మి, పద్మ, మంజుల, సువర్ణ పాల్గొన్నారు.

కోర్టు నిర్మాణానికి రూ.24 కోట్లు

మహేశ్వరం: కందుకూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్మాణానికి రూ.24 కోట్లు కేటాయించడం హర్షణీయమని మహేశ్వరం బార్ కౌన్సిల్, బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మంత్రి సబితారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న మహేశ్వరం కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని.. ఇది న్యాయవాదులతో పాటు కక్షిదారులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందన్నారు. అదే విధంగా కందుకూరులో రెసిడెన్షియల్ న్యాయ కళాశాల, బీఏ, ఎల్‌ఎల్‌బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు ప్రారంభించడంతో న్యాయవిద్య వైపు వెళ్లే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ శివకుమార్, కోశాధికారి మురళి, న్యాయవాదులు పూర్ణకుమార్, రాజేష్, శ్రీకాంత్, భాస్కర్, చంద్రశేఖర్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



అనంతగిరి: మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను గురువారం వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుల బొకే అందజేశారు.



పరిగి: మున్సిపల్, ఐటి శాఖమంత్రి కేటీఆర్‌ను పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పరిగి అభివృద్ధి, పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరానని తెలిపారు. స్పందించిన కేటీఆర్ త్వరలోనే నిధులు కేటాయిస్తామని తెలిపారని అన్నారు.